తొలి పూజ నీకేనయ్యా గణనాథా..

- నేటి నుంచి చవితి సందడి
- కిటకిటలాడిన దుకాణాలు

మండపేట: విఘ్నాలు తొలగించే గణనాథుని రాక కోసం ఊరువాడా ముస్తాబయ్యాయి. ఎక్కడ చూసినా కోలాహలం. గణనాథుని కోసం సిద్ధం చేసిన మండపాలే కనిపిస్తున్నాయి. పూజాసామగ్రి కొనుగోలుదారులతో ఆదివారం మార్కెట్లు కిటకిటలాడాయి. గణనాథున్ని ప్రతిష్ఠించుకునేందుకు ఎవరికి వారు త మతమ ఇళ్లను, వ్యాపార సంస్థలను, వాహనాలను శుభ్రం చేసుకుంటూ బిజీగా కనిపించారు. ఉత్సవ కమిటీలు వాడవాడలా ప్రత్యేక మందిరాలను ఏర్పాటు చేసి సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. భారీ సైజులో గణనాథుని విగ్రహాలను నెలకొల్పేందుకు పోటాపోటీగా ఏర్పాట్లు చేశారు. మిరుమిట్లు గొలిపే విద్యుత్తు దీపాలు, రంగురంగుల కాగితపు పూలదండలతో ప్రత్యేకంగా అలంకరించారు. పట్టణంలోని వల్లూరి వారి వీధి, గాంధీనగర్, సైధిల్‌పేట, బ్యాంకు కాలనీ, కొండపల్లి వారి వీధి, పాటిమీద, ధర్మగుండం, న్యూ కాలనీ, గొల్లపుంత తదితర ప్రాంతాల్లో 50కు పైగా మండపాలు ఏర్పాటు చేశారు. మరోపక్క పూజా సామగ్రి కొనుగోలుదారులతో రూరల్, రాయవరం, కపిలేశ్వరపురం మండల గ్రామాల్లోని ప్రధాన కూడళ్ల మార్కెట్లు కిక్కిరిశాయి. మండపేట, పరిసర గ్రామాల నుంచి పెద్ద ఎత్తున తరలి వచ్చిన వినియోగదారులతో పట్టణంలోని కపిలేశ్వరపురం రోడ్డు కిటకిటలాడింది. ప్రత్యేకంగా వెలసిన పూజా సామగ్రి దుకాణాలు వినియోగదారులతో కిటకిటలాడాయి. చాగల్నాడు ప్రాంతానికి చెందిన వ్యాపారులు అక్కడి నుంచి పూజకు వినియోగించే పత్రిని తీసుకు వచ్చి విక్రయించారు. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది పూజాసామగ్రి ధరలు బాగా పెరిగాయని భక్తులు అంటున్నారు.



మండపేటలో పూజాసామగ్రి కొనుగోలు చేస్తున్న వినియోగదారులు



రాయవరం బస్టాండ్ సెంటర్‌లో పూజాసామగ్రి కొనుగోలు చేస్తున్న భక్తులు

'బఠానీ' లంబోదరుడు

రాయవరం: విఘ్నాలు తొలగించే విఘ్నపతిని ఘనంగా పూజలు చేసేందుకు భక్తులు ఏర్పాట్లు చేసుకున్నారు. గణనాథుడ్ని పలువురు పలు విధాలుగా తయారు చేసుకుని తమ భక్తి ప్రపత్తులను చాటుకుంటుంటారు. అదే తరహాలో రాయవరానికి చెందిన ప్రైవేట్ ఉద్యోగి ఇండుగమిల్లి సౌధాగర్ పచ్చి బఠానీలు, రంగురంగుల పూసలతో రూపొందించిన లంబోదరుడి చిత్రం చూపరులను విశేషంగా ఆకట్టుకుంటోంది. సుమారు రెండు గంటల పాటు శ్రమించి రెండు అడుగుల ఎత్తు, రెండు అడుగుల వెడల్పుతో దీన్ని రూపొందించారు.



బఠానీలు, పూసలతో తయారు చేసిన వినాయకుడు



ఇండిగమిల్లి సౌధాగర్(ఫైల్)

రాయవరం మండలంలో..

రాయవరం: చవితి వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు మండలంలో ముమ్మరంగా ఏర్పాట్లు చేశారు. గ్రామాల్లో ఆదివారం నుంచే పండగ సందడి నెలకొంది. మార్కెట్లు కిటకిటలాడాయి. వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు స్వామివారి ఆలయాలు, మండపాలు ముస్తాబయ్యాయి.రాయవరం, లొల్ల, వెదురుపాక, వి.సావరం, వెదురుపాక, నదురుబాద, సోమేశ్వరం, మాచవరం పసలపూడి, చెల్లూరు, వెంటూరు, కూర్మాపురం, కురకాళ్లపల్లి గ్రామాల్లో చవితి మండపాలు ఏర్పాటు చేశారు. రాయవరం, మాచవరం, పసలపూడి గ్రామాల ప్రధాన సెంటర్లలో పూజా సామగ్రి, స్టాల్స్ ప్రధాన రహదారులను ఆనుకుని ఏర్పాటు చేశారు. చవితి పూజలకు ఉపయోగించే పండ్లు, పూలు, వివిధ రకాల పత్రి, బెల్లం, కూరగాయలు, అరటిపండ్ల ధరలను పెంచి వ్యాపారులు విక్రయించారు. మండపాల్లో సోమవారం ఉదయం స్వామి వారి విగ్రహాలను ప్రతిష్ఠించడానికి నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. వివిధ గ్రామాల నుంచి స్వామి వారి విగ్రహాలను ట్రాక్టర్లు, ఇతర వాహనాలపై తరలిస్తూ కన్పించారు.

గణపతి నవరాత్రులకు ఏర్పాట్లు పూర్తి

రామచంద్రపురం/రామచంద్రపురం రూరల్/కె.గంగవరం/కాజులూరు: నియోజకవర్గంలోని రామచంద్రపురం పట్టణంతో పాటుగా రూరల్, కె.గంగవరం, కాజులూరు మండలాల్లో ఎక్కడ చూసినా పండగ సందడి వాతావరణం నెలకొంది. గణనాథుణ్ణి ప్రతిష్ఠించేందుకు ఎవరికి వారు తమ తమ ఇళ్లను, వ్యాపార సంస్థలను, వాహనాలను శుభ్రం చేసుకుంటూ బిజీబిజీగా గడిపారు. వినాయకున్ని ప్రతిష్ఠించేందుకు గణేష్ ఉత్సవ కమిటీల వారు వాడవాడలా ప్రత్యేక మందిరాలను ఏర్పాటు చేసి సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. చలువ పందిళ్లు ఏర్పాటు చేసి భారీసైజులో గణనాథుని విగ్రహాలను నెలకొల్పేందుకు పోటాపోటీగా ఏర్పాట్లు చేశారు. మిరుమిట్లు గొలిపే విద్యుత్ దీపాలు, రంగురంగుల కాగిత పూల దండలతో ప్రత్యేకంగా అలంకరించారు. మరోపక్క పూజా సామగ్రి కొనుగోలుదారులతో రామచంద్రపురం పట్టణంతో పాటుగా ద్రాక్షారామ, కె.గంగవరం, గొల్లపాలెం, కాజులూరు గ్రామాల్లోని ప్రధాన కూడళ్ల మార్కెట్లు కిటకిటలాడాయి. కాజులూరులో వినాయక చవితి నిర్వహించుకునేందుకు మండల గ్రామాల్లోని ప్రజలు సర్వం సిద్ధమయ్యారు. గ్రామాల్లోని విఘ్నేశ్వరాలయాలను విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించి ఆలయాల ఎదుట చలువ పందిళ్లు వేశారు. మండలంలోని గొల్లపాలెం, కాజులూరు, జగన్నాథగిరి, కోలంక తదితర ప్రధాన గ్రామాల్లో మార్కెట్ సెంటర్లు కళ, కళలాడాయి.

అనుమతులు తప్పనిసరి

వినాయక ఉత్సవాలు నిర్వహించే మండపాల ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలి. తొమ్మిది రోజుల పాటు నిర్వహించే గణపతి నవరాత్రుల్లో ప్రతి రోజూ నిర్వహించే ధూప, దీప నైవేద్యాల సమయంలో ఎటువంటి అగ్నిప్రమాదాలకు తావులేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. మండపాల వద్ద డిబ్బీల దొంగతనం జరగకుండా కమిటీ సభ్యులు నిత్యం కాపలాగా ఉండాలి. నిమజ్జనం చేసే సమయంలో డీజేలు ఏర్పాటు చేసి మితిమీరిన శబ్ద కాలుష్యానికి కారకులు కాకుండా సంప్రదాయబద్ధంగా ఏర్పాటు చేసుకోవాలని పామర్రు ఎస్సై జానీబాషా కోరారు.

గ్రామాల్లో వినాయక చవితి కొనుగోళ్ల సందడి

రామచంద్రపురం రూరల్: మండలంలోని గ్రామాల్లో వినాయచవితి పురస్కరించుకుని వినాయక ప్రతిమలు, పూవులు, పళ్లు, పత్రి కొనుగోళ్లతో సందడి నెలకొంది. గతానికి భిన్నంగా ప్రజల్లో పెరిగిన అవగాహనతో మట్టి వినాయక ప్రతిమలు కొనడానికే అధిక ప్రజలు మొగ్గుచూపారు. మరోవైపు వినాయక మండపాల ఏర్పాట్లలో ఆయా గ్రామాల పెద్దలు, యువకులు నిమగ్నమయ్యారు.

మట్టి గణపతే...మహా గణపతి

రాయవరం: వినాయక చవితిని పురస్కరించుకుని ఆదివారం పలు స్వచ్ఛంధ సంస్థలు వినాయక మట్టి ప్రతిమలను పంపిణీ చేశారు. మట్టి ప్రతిమను అందుకున్న చాణిక్య ఆస్పత్రి అధినేత డాక్టర్ జీఎస్ఎన్ రెడ్డి మాట్లాడుతూ రసాయనిక పదార్థాలతో విగ్రహాలు ప్రతిష్ఠించడం వలన పర్యావరణానికి హాని కలిగి భవిష్యత్తు తరాలకు తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. మట్టి వినాయకులను వినియోగించండి..పర్యావరణాన్ని పరిరక్షించండి అంటూ పలు పాఠశాలల విద్యార్థులు, పీఏస్ఆర్ యూత్ సభ్యులు, స్వచ్ఛంధ సంస్థల కార్యకర్తలు కార్యాలయాలకు వెళ్లి అధికారులకు మట్టి విగ్రహాలను అందించారు. కార్యక్రమంలో వేంకటేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ పులగం శ్రీనివాసరెడ్డి ఈశ్వరరెడ్డి నగర్, జమీందార్ కాలనీల వినాయక కమిటీ సభ్యులు కొవ్వూరి రామారెడ్డి, కోనాల సుధాకరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ద్రాక్షారామలో వినాయక వ్రత సామగ్రి కొనుగోళ్ల సందడి



రాయవరంలో వినాయక మట్టి ప్రతిమను బహూకరిస్తున్న వినాయక కమిటీ సభ్యులు



కాజులూరులో నవరాత్ర ఉత్సవాలలో ప్రతిష్ఠించేందుకు సిద్ధం చేసిన వినాయక విగ్రహం

అర్హత ఉంటే అందరికీ పింఛన్లు

కె.గంగవరం: ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హత ఉంటే అందరికీ సీఎం జగన్ ప్రభుత్వం నూతన పింఛన్లను మంజూరు చేస్తుందని రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమచార శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఆదివారం మండలంలోని అన్ని గ్రామాల్లో నూతనంగా మంజూరు అయిన పింఛన్లను లబ్ధిదారులకు మంత్రి చెల్లుబోయిన వేణు చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఎంపీపీ పంపన నాగమణి అధ్యక్షతన జరిగిన సమావేశంలో మంత్రి చెల్లుబోయిన వేణు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో పింఛన్ పొందాలంటే నరకయాతన పడాల్సి వచ్చేదన్నారు. ఎవరైనా చనిపోతే ఆ స్థానంలో మరొకరికి మాత్రమే పింఛన్ మంజూరు చేశారని గుర్తు చేశారు. గత మూడునెలలుగా మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో అర్హత ఉన్న 437 మందికి నూతన పింఛన్లు మంజూరు కావడంతో పాటు సొమ్ములకు కూడా అందించామన్నారు. ప్రతి నెలా ఠంఛన్‌గా ఒకటో తేదీ తెల్లవారుజామునే వలంటీర్ ఇంటికి వచ్చి పింఛన్ సొమ్మును అందిస్తున్నారన్నారు. ప్రతి లబ్ధిదారుడు గమనించాలని మనసెరిగిన నేత సీఎం జగనన్నను మరోసారి గెలిపించాలని కోరారు. జెడ్పీటీసీ ఓబులనేని శ్రీవరలక్ష్మి, పార్టీ మండల అధ్యక్షుడు పెట్టా శ్రీనివాస్, మార్కెట్ కమిటి చైర్మన్ పండు గోవిందరాజు, ఎంపీడీఓ ఎన్.శ్రీనివాసరావు, సచివాలయాల మండల కన్వీనర్ తోకల శ్రీను, ఎంపీటీసీలు కొప్పిశెట్టి లక్ష్మణ్, పిల్లి దుర్గాప్రసాద్, సర్పంచ్‌లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



లబ్ధిదారులకు నూతన పింఛన్లు అందజేస్తున్న మంత్రి చెల్లుబోయిన వేణు

ముగిసిన క్రీడా పోటీలు

రామచంద్రపురం రూరల్: ఏపీ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-14, అండర్-17 బాలబాలికల మండల స్థాయి క్రీడా పోటీలు ఆదివారంతో ముగిశాయి. రెండు రోజుల పాటు పట్టణంలోని కృత్తివెంటి పేర్రాజు పంతులు క్రీడా ప్రాంగణంలో వివిధ విభాగాల్లో ఎంపిక పోటీలు నిర్వహించారు. ముగింపు కార్యక్రమానికి ముఖ్య తిథులుగా ఎంపీపీ అంబటి భవాని, మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవిలు పాల్గొన్నారు. బాలుర అండర్-17 విభాగంలో వాలీబాల్‌లో ఆదివారపుపేట ప్రథమం, ఎస్ఎస్‌పేట ద్వితీయ, కబడ్డీలో ఆదివారపుపేట ప్రథమం, ద్రాక్షారామ ద్వితీయ, ఖోఖోలో ద్రాక్షారామ గురుకుల పాఠశాల ప్రథమం, హసన్‌బాద ద్వితయ స్థానాలు సాధించారు. అండర్-14 వాలీబాల్‌లో ఆదివారపుపేట ప్రథమ, ఎస్ఎస్‌పేట ద్వితీయ, ఖోఖోలో పిల్లావారి స్కూల్ ప్రథమ, ద్రాక్షారామ ద్వితీయ స్థానాలు కైవసం చేసుకున్నారు. బాలికలు అండర్-17 విభాగం వాలీబాల్ వెల్ల, హసన్‌వాద ద్వితీయ, కబడ్డీలో చాకలిపేట స్కూల్ ప్రథమ, గురుకుల పాఠశాల ద్వితీయ స్థానాలు, ఖోఖోలో చాకలిపేట ప్రథమ, గురుకుల పాఠశాల ద్వితీయ స్థానాలను సాధించారు. బాలికల అండర్-14లో వాలీబాల్ వెల్ల స్కూల్ ప్రథమ, హసన్‌బాద ద్వితీయ, కబడ్డీలో చాకలిపేట ప్రథమ, హసన్‌బాద ద్వితీయ ఖోఖోలో హసన్‌బాద ప్రథమ, పిల్లా వారి స్కూల్ ద్వితీయ స్థానాలను కైవసం చేసుకున్నారు. మండల స్థాయి పోటీలలో విజయం సాధించిన విజేత జట్లు నియోజకవర్గ స్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. ఎంపీపీ భవాని, చైర్‌పర్సన్ శ్రీదేవిలు విజేతలకు ప్రశంసా పత్రాలను మెమెంటోలను అందజేశారు. హెచ్ఎం టీవీ రాఘవరెడ్డి, వివిధ పాఠశాలల్లో హెచ్ఎంలు, పీఈటీలు పాల్గొన్నారు.



వాలీబాల్ పోటీలో విజేతలైన బాలుర జట్టుతో ఎంపీపీ భవాని, చైర్‌పర్సన్ శ్రీదేవి తదితరులు

ఘనంగా విశ్వకర్మ జయంతి

మండపేట: విశ్వకర్మ జయంతిని మండపేట విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. స్థానిక కామాక్షి ఆలయం వద్ద నిర్వహించిన వేడుకలో తొలుత విశ్వకర్మ పతాకావిష్కరణ చేశారు. అనంతరం విశ్వకర్మకు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. విశ్వకర్మ జయంతిని పురస్కరించుకుని పీఎం విశ్వకర్మ యోజనను తీసుకువచ్చి రూ.13 వేల కోట్లు విడుదల చేసిన ప్రధాని నరేంద్ర మోదీకి సంఘ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ప్రధాని మోదీ చిత్ర పటానికి పాలాభిషేకం నిర్వహించారు. చేతివృత్తుల వారి అభ్యున్నతికి ఈ పథకం ఎంతో దోహదపడుతుందన్నారు. సంఘ నాయకులు వేముల శ్రీరామమూర్తి, జేసీ ప్రసాద్, వీరమల్ల శ్రీనివాసు, విన్నకోట ప్రసాద్, పొన్నాడ ప్రభాకరరావు, కోటిపల్లి కృష్ణమాచార్యులు, పట్నాల శ్రీనివాస్, అత్తిలి సత్యనారాయణ, రామోజీ కృష్ణ, భవిరి సత్యనారాయణ, ఒంపోలు పోలరాజు తదితరులు పాల్గొన్నారు.

రాయవరం మండలంలో..


రాయవరం: విరాట్ విశ్వకర్మ భగవాన్ జయంతిని ఆదివారం సోమేశ్వరం శివారు రెడ్డికృష్ణమ్మపేట వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయం వద్ద నిర్వహించారు. సోమేశ్వరం, మాచవరం గ్రామాల విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఈ వేడుక నిర్వహించారు. విశ్వకర్మ చిత్ర పటానికి పమిడిపల్లి వీరన్న, మహాలక్ష్మి దంపతులు పీటలపై కూర్చుని ప్రత్యేక పూజలు చేశారు. పూజల్లో భాగంగా పుణ్యాహవచనం, అఖండజ్యోతి ప్రజ్వలనం, బ్రహ్మగణ మండపారాధన చేశారు. ఈ సందర్భంగా విశ్వబ్రాహ్మణ సంఘం నేతలు తమ ప్రసంగాల్లో విశ్వకర్మ భగవాన్ విశిష్టతను వివరించారు. ప్రపంచానికి పనిముట్లను పరిచయం చేసిన విశ్వకర్మ పూజ్యునీయుడన్నారు.

రామచంద్రపురం: విశ్వకర్మ జయంతిని అధికారికంగా జరుపుకోవడం శుభప్రదమని బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన వేణు తెలిపారు. విశ్వకర్మ జయంతిలో భాగంగా ఆదివారం రామచంద్రపురంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో విశ్వకర్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. మంత్రి మాట్లాడుతూ బీసీ కులాల్లో నైపుణ్యం ఉన్న విశ్వకర్మ సేవలను అభివర్ధిస్తూ సీఎం జగన్ ఆయా వర్గాలకు చేస్తున్న కృషిని వివరించారు. పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు. స్థానిక 23వ వార్డులో వేంచేసిన వీరబ్రహ్మేంద్రస్వామి వారి ఆలయంలో ఆదివారం విశ్వకర్మ జయంతిని వైభవంగా నిర్వహించారు. ఆలయంలో రాష్ట్ర మంత్రి వేణు తనయుడు నరేన్ విశ్వకర్మకు పూజలు నిర్వహించారు. విశ్వకర్మ జయంతి ఏటా రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని జీవో జారీ చేయడంపై సీఎం జగన్‌కి నరేన్ ధన్యవాదాలు తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, 23వ వార్డ్ కౌన్సిలర్ చీఫ్ విప్ వాడ్రేవు సాయిప్రసాద్, పార్టీ పట్టణ కన్వీనర్ గాదంశెట్టి శ్రీధర్, విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ దార్ల ప్రభావతి, విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు గాడాల సాయి, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.


రామచంద్రపురం రూరల్: మండలంలోని ద్రాక్షారామలో వేంచేసిన పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో ఆదివారం కామాక్షి విశ్వ బ్రాహ్మణ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో 21 వ గాయత్రీ సమేత విరాట్ విశ్వకర్మ యజ్ఞ మహోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం విశ్వకర్మ పతాక ఆవిష్కరణ చేశారు. అనంతరం సంఘ అధ్యక్షుడు కొసనా భీమశంకరం, విశ్వలక్ష్మి, సంఘ సభ్యుడు నెల్లూరి శ్రీరామచంద్రమూర్తి, ఈశ్వరి దంపతుల చేతుల మీదుగా పురోహితుడు కొడమంచిలి సత్తిబాబు బ్రహ్మత్వంలో ప్రత్యేక పూజలు జరిపించారు. భక్తులకు అన్నప్రసాదం ఏర్పాటు చేశారు. సాయంత్రం స్వామివారికి పల్లకీ సేవ నిర్వహించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు, సర్పంచ్ కొత్తపల్లి అరుణ, ఉప సర్పంచ్ పెన్నాడ బుచ్చిరాజు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.



మండపేటలో విశ్వకర్మ పతాకావిష్కరణ చేస్తున్న విశ్వబ్రాహ్మణ సంఘం నేతలు



సోమేశ్వరంలో విశ్వకర్మ పూజలు చేస్తున్న భక్తులు



నరేన్‌ను సత్కరిస్తున్న విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు

ప్రభుత్వ డిగ్రీ కళాశాలను సందర్శించనున్న న్యాక్ కమిటీ

రావులపాలెం: కళాశాల మౌలిక సదుపాయాలు, బోధనాంశాలను పరిశీలించి గ్రేడ్ ఇచ్చేందుకు నేషనల్ అసెస్మెంట్ అండ్ అక్రిడేషన్ కౌన్సిల్ (న్యాక్) (బెంగళూరు) కమిటీ బృందం ఈ నెల 20, 21 తేదీల్లో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలను సందర్శించనున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.జ్యోతి తెలిపారు. ఆదివారం స్థానికంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె ఈ వివరాలను వెల్లడించారు. ఆ కమిటీ బృందం కళాశాలకు సంబంధించిన ఏడు రకాలుగా ఉన్న వివిధ విభాగాల విద్యా ప్రమాణాలను చూసి పరిశీలించి గ్రేడింగ్ ఇస్తుందన్నారు. అయితే ఇప్పటి వరకూ రెండు పర్యాయాలు న్యాక్ కమిటీ పరిశీలించి బీ-గ్రేడ్ ఇచ్చిందన్నారు.

క్లుప్తంగా

జగనన్న ఆరోగ్య సురక్షకు ఏర్పాట్లు

కపిలేశ్వరపురం: ఈ నెల 30 నుంచి ప్రారంభం కానున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం విజయవంతానికి మండల స్థాయి అధికారులు సన్నద్ధం అవుతున్నారు. గ్రామాల్లో పర్యటించేందుకు అధికారులతో బృందాన్ని ఏర్పాటు చేశారు. ప్రజల ఆరోగ్య సమస్యలను తెలుసుకోవడమూ, సరైన వైద్య సదుపాయం కల్పించడమూ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి తెలిపారు. ఇంటింటికీ వెళ్లి పరీక్షలు చేసి కేస్ షీట్ తయారు చేస్తారు. గ్రామాల్లో కార్యక్రమాన్ని పర్యవేక్షించేందుకు రెండు బృందాలను ఏర్పాటు చేశారు. ఒక బృందంలో ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ పాదిలి వెంకటేశ్వరరావు, ఎంపీడీఓ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ వైకే చైతన్య ఉన్నారు. మరో బృందంలో తహసీల్దార్ కొమరం సూర్యారావు, ఎంఈఓ కె.తాతారావు, తహసీల్దార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ వై.శ్రీనివాస్ ఉన్నారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలే లక్ష్యం



మండపేట శాఖను ప్రారంభిస్తున్న కామేశ్వరరావు

మండపేట: ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించే లక్ష్యంతో చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు పని చేస్తోందని ఆ బ్యాంకు చైర్మన్ టి.కామేశ్వరరావు అన్నారు. బ్యాంకు 251 శాఖను ఆదివారం ఆయన మండపేటలో ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ కామేశ్వరరావు మాట్లాడుతూ ప్రస్తుతం తమ బ్యాంకు రూ.19,235 కోట్ల టర్నోవర్‌తో వ్యాపారంలో ముందంజలో ఉందన్నారు. బ్యాంకు డిపాజిట్లపై 8.10 శాతం వడ్డీ, సీనియర్ సిటిజన్లకు 8.60 శాతం వడ్డీ ఇస్తున్నామన్నారు. తమ బ్యాంకు అందిస్తున్న సదుపాయాలను మండపేట ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మండపేట చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కాళ్లకూరి నాగబాబు, పారిశ్రామికవేత్త కొనగళ్ల సత్యనారాయణ, కాళ్లకూరి గొల్లబాబు, బ్రాంచి మేనేజర్ సాక్షి జయకృష్ణమ నాయుడు, ఆర్ఎం పర్ల శ్రీనివాస్, ప్లానింగ్ మేనేజర్లు రామారెడ్డి, అంజనేయులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించండి

రామచంద్రపురం: వినాయక చవితిని మట్టి వినాయక ప్రతిమల ద్వారా స్వామికి పూజలు చేసి ప్రతి ఒక్కరూ పర్యవరణాన్ని పరిక్షించాలని రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ విజ్ఞప్తి చేశారు. వైఎస్సార్ సీపీ యువజన విభాగం ఆధ్వర్యంలో మంత్రి తనయుడు నరేన్ ఆధ్వర్యంలో తయారు చేసిన వినాయక మట్టి ప్రతిమలను ఆదివారం మున్సిపల్ కార్యాలయం ఎదురుగా ఉన్న మహానేత డాక్టర్ వైఎస్సార్ విగ్రహం వద్ద ప్రజలకు మట్టి వినాయక ప్రతిమలను మంత్రి వేణు పంపిణీ చేశారు.

ఘనంగా ప్రధాని మోదీ జన్మదిన వేడుకలు



మండపేటలో ప్రధాని మోదీ జన్మదిన వేడుకలు నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

మండపేట: ప్రధాని నరేంద్ర మోదీ జన్మదిన వేడుకలను ఆదివారం బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. పార్టీ నాయకులు కోన సత్యనారాయణ, చాట్రాతి జానకి రాంబాబు, ఇళ్ల వెంకటేశ్వరరావు, కేవీవీ సాయిరామ్, మద్దుల సుబ్బారావు తదితరులు మండపేట, మండలంలోని పలు ఆలయాల్లో పూజలు నిర్వహించారు. అనంతరం స్థానిక కలువ పువ్వు సెంటర్‌లో కేక్ కట్ చేసి పేదలకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు నేతలు మాట్లాడుతూ ప్రజారంజక పాలనతో దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న ఘనత ప్రధాని మోదీకి దక్కుతుందన్నారు. పార్టీ నాయకులు నరాల రాంబాబు, బలిరెడ్డి సత్యనారాయణ, బుద్ధవరపు, రాజు, పాలిక రమణ, హేమంత్ పటేల్, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

కె.గంగవరం: మండలంలోని కోటిపల్లిలో ఆదివారం ప్రధాని మోదీ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. బీజేపీ నాయకులు సలాది శేఖర్, ఆకేటి శ్రీకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో జిల్లా బీజేపీ నాయకుడు కర్రి చిట్టిబాబు పాల్గొని స్వీట్లు పంచారు. మండల బీజేపీ అధ్యక్షుడు ఏవీ రమణమూర్తి ఆధ్వర్యంలో అంజనేయ స్వామి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేశారు.

కాజులూరులో..

కాజులూరు: మోదీ నాయకత్వంలోనే దేశం పురోగతి సాధిస్తుందని అమలాపురం పార్లమెంట్ జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి దూడల శంకర్‌నారాయణ అన్నారు. మోదీ జన్మదినోత్సవ కార్యక్రమాలను ఆదివారం కాజులూరు మండల గ్రామాలలో ఆ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు.